ప్రజాశక్తి
మంగళవారం 12 మార్చి 2024
5
శ్రీ సత్యసాయి





భైరవాని తిప్ప ప్రాజెక్టు (ఫైల్ ఫోటో)



ధర్మవరం ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ఎన్నికల బాండ్లలో బిజెపి కుట్ర

◆ తక్షణం వివరాలను ప్రకటించాలి ◆ ఎస్‌బిఐల ఎదుట ధర్నాలో సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- ధర్మవరం టౌన్

ఎన్నికల బాండ్ల విషయంలో బిజెపి పెద్ద ఎత్తున కుట్ర చేస్తూ అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతోందని సిపిఎం నాయకులు విమర్శించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ తక్షణమే ప్రకటించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా అన్ని ఎస్‌బిఐ బ్యాంకుల వద్ద సోమవారం నాడు ఆందోళనలు చేపట్టారు. ధర్మవరం పట్టణంలోని మార్కెట్ వద్ద ఉన్న ఎస్‌బిఐ ప్రధాన బ్రాంచి వద్ద జరిగిన ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీలకు సంబంధించిన ఎన్నికల బాండ్ల వివరాలను ఎస్‌బిఐ ప్రకటించకపోవడం అభ్యంతకరంగా ఉందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల వ్యవస్థను మరింత భ్రష్టు పట్టించిందని విమర్శించారు. 2017లో ఎన్నికల బాండ్ల వ్యవస్థను ప్రవేశపెట్టి వేల కోట్ల రూపాయలను అక్రమంగా తమ ఖాతాలోకి వేసుకుందని విమర్శించారు. విశ్వసనీయత, పారదర్శకత గురించి మాట్లాడే బిజెపి నాయకులు ఎన్నికల బాండ్లపై సుప్రీంకోర్టు తీర్పుపై ఇప్పటి వరకు స్పందించకపోవడం దాని మోసకారి వైఖరికి నిదర్శనం అన్నారు. ఎన్నికల బాండ్లు ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రమాదమని సిపిఎం సుప్రీంకోర్టులో ఫిర్యాదు చేసిందన్నారు. దాని ఫలితంగా గత ఫిబ్రవరి నెలలో తీర్పు వచ్చిందని గుర్తు చేశారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్లను తక్షణమే రద్దు చేయాలని మార్చి 6వ తేదీ లోపు ఈ బాండ్లు కొనుగోలు చేసిన వారి వివరాలు అందించాలని, మార్చి 13వ తేదీ నాటికి ఏ ఏ పార్టీకి ఎంత మొత్తంలో ఈ బాండ్లు అందాయో ఆన్‌లైన్‌లో ఉంచాలని ఎన్నికల సంఘాన్ని తీర్పులో సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. అయితే ఆ తీర్పును అమలు చేయకుండా జూన్ 30 వరకు తనకు సమయం కావాలని ఎస్‌బిఐ ద్వారా కోర్టులో పిటిషన్ వేయించడం వెనక బిజెపి హస్తం ఉందన్నారు. ఎన్నికల బాండ్ల వల్ల అత్యధికంగా లాభపడింది బిజెపి అనే విషయం బయటకు వస్తే ఎన్నికల ముందు తన నిజ స్వరూపం బట్టబయలవుతుందని ఆ పార్టీ భయపడుతోందన్నారు. దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేయడం వెనక ఈ అక్రమ డబ్బు ప్రభావం ఉందన్నారు. అలాగే వేల కోట్ల రూపాయలను ఎన్నికల కోసం ఖర్చు పెట్టడం, ప్రత్యర్థి పార్టీలను భయపెట్టడం అందులోని నాయకులను కొనుగోలు చేయడం అక్రమంగా అధికారాన్ని అనుభవించడం బిజెపి నైజం అని విమర్శించారు. ఎస్‌బిఐ ఉన్నతాధికారులు ఇప్పటికైనా సుప్రీంకోర్టు తీర్పును గౌరవించి ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకుడు ఎస్‌హెచ్.బాషా, సిఐటియు మండల అధ్యక్షుడు ఎల్.ఆదినారాయణ, రైతుసంఘం మండల అధ్యక్షుడు మారుతి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగార్జున, నాయకులు కదిరెప్ప, వెంకటస్వామి, నరసింహారెడ్డి, వెంకటరాముడు పాల్గొన్నారు.

‘పార్థుడికి ‘పురం’ ఎంపి టికెట్ ఇవ్వాల్సిందే’

తెగేసి చెప్పిన పార్టీ శ్రేణులు, బికె అభిమానులు

ప్రజాశక్తి -పెనుకొండ



సమావేశంలో మాట్లాడుతున్న బికె పార్థసారధి

టిడిపి జిల్లా అధ్యక్షులు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బికె.పార్థసారథికి హిందూపురం ఎంపి టికెట్ ప్రకటిస్తేనే పార్టీ కోసం పని చేస్తామని పార్టీ శ్రేణులు, బికె.అభిమానులు తెగేసి చెప్పారు. పట్టణంలోని బికె.పార్థసారథి నివాసం వద్ద సోమవారం బికె అధ్యక్షతన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సీనియర్ నాయకులు మాట్లాడుతూ బికెని హిందూపురం పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత భారీ స్థాయిలో సమావేశం ఏర్పాటు చేయాలని అభిప్రాయం వ్యక్తం చేశారు. దీనిపై పార్థసారథి స్పందిస్తూ చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందని, అందుకు మీరు సహకరించాలని కోరారు. నియోజకవర్గ పరిశీలకు లు డాక్టర్ నరసింహారావు మాట్లాడుతూ బికెకి 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రస్తావించిన విషయాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం నరసింహారావు సవితమ్మతో కలిసి బికె వద్దకు వచ్చారు. సవితమ్మ ప్రచారం ప్రారంభించాలని పార్థసారథిని అడగ్గా పార్టీ నాయ కులు, కార్యకర్తలు, అభిమానులతో చర్చిస్తామని తెలిపారు.

13 నుంచి ఎన్నికల ప్రచారం : సవితమ్మ

ప్రజాశక్తి -పెనుకొండ



మాట్లాడుతున్న పార్టీ పరిశీలకులు నరసింహారావు, సవితమ్మ

ఈ నెల 13వ తేదీ నుంచి ఎన్నికల శంఖారావం ప్రచారం ప్రారంభిస్తామని టీడీపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మ పేర్కొన్నారు. ఆమె సోమవారం పట్టణంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారథిని కలిసి బుధవారం మంచిరోజు కావడంతో ఎన్నికల ప్రచార కార్యక్రమం ప్రారంభిస్తామని తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సవితమ్మ, పార్టీ పరిశీలకులు నరసింహారావు మీడియాతో మాట్లాడుతూ 13వ తేదీ ఉదయం 8 గంటలకు పెనుకొండ మండలంలోని మునిమడుగు గ్రామంలో ఎన్నికల శంఖారావాన్ని ప్రారభిస్తున్నామని తెలిపారు.

సొంత గూటికి చేరిన టిడిపి నాయకులు, కార్యకర్తలు

సోమందేపల్లికి చెందిన పలువురు టిడిపి నాయకులు ఇటీవల మంత్రి ఉషశ్రీచరణ్ సమక్షంలో వైసిపిలో చేరారు. వారు సోమవారం తిరిగి సొంత పార్టీ టీడీపీలోకి చేరగా సవితమ్మ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. చేరిన వారిలో వెంకటరమణ, రమణ, రమేష్, విజయ్, వెంకటేష్, అలివేలమ్మ, సుబ్బరాయుడు, మోహన్‌కృష్ణ, వెంకటేష్, నాగప్ప ఉన్నారు.

కూటమి ప్రభుత్వ ఏర్పాటు ఖాయం

ఉమ్మడి అభ్యర్థి సునీల్‌కుమార్

ప్రజాశక్తి-మడకశిర



విలేకరులతో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి సునీల్‌కుమార్, ఈరన్న


టిడిపి, బిజెపి, జనసేన పార్టీల పొత్తుతో చారిత్రాత్మక విజయం ఖామయని ఉమ్మడి అభ్యర్థి సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈరన్న తెలిపారు. పట్టణంలోని టిడిపి కార్యాలయంలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఐదేళ్లలో ప్రతి ఒక్కరూ ఇబ్బందులు పడ్డారని, ఏ వర్గానికీ న్యాయం జరగలేదన్నారు. దీంతో రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాన్ని దింపేందుకు అన్ని పార్టీలు ఏకమైయ్యా యన్నారు. బిజెపి, టిడిపి, జనసేనపార్టీలు పొత్తులో భాగంగా 150కి పైగా స్థానాల్లో ఘన విజయం సాధించి ఉమ్మడి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయని ధీమా వ్యక్తం చేవారు. కేంద్రంలో కూడా బిజెపి ప్రభు త్వం ఏర్పాటు కాబోతుందని తద్వారా రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం పాండురంగప్ప, జిల్లా కార్యదర్శి రవిభూషణ్, అశ్వర్థామప్ప, ఆదినారాయణ, రామాంజనేయులు, టిడి పల్లి మంజునాథ్, రామన్న, రాజగోపాల్, రమేష్, ఎస్ఎం కృష్ణప్ప, చిన్న చెన్నయ్య, కర్రెన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వెనుకబడిన ‘దుర్గం’

కళ్యాణదుర్గం నియోజకవర్గం అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉంది. సాగు,తాగునీటికి కూడా కటకటలాడే ప్రాంతమిది. అత్యధికంగా వ్యవసాయంపైనే ఆధారపడిన ప్రాంతమైనప్పటికీ నిఖర జలాలు ఏ మాత్రం అందని ప్రాంతమిది. సాగునీటి ప్రాజెక్టు ఒక్కటీ లేదు. కేవలం వర్షాధారంపైనా, భూగర్భ జలాలపై ఆధారపడి పంటలు సాగుచేసుకుని జీవనం సాగించాలి. లేకపోతే ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్లాల్సి ఉంటుంది. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలను తరలిస్తామని ఇచ్చిన హామీ ఇప్పటికీ పూర్తవ లేదు. కేవలం కాగితాలకే పరిమితమైంది.

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

◆ సాగు,తాగునీటికి తప్పని కష్టాలు
◆ ఉపాధి కోసం పక్క రాష్ట్రాలకు వలసలు
◆ మాటలకే హామీలు పరిమితం



ముందుకు సాగని భైరవానితిప్ప

ఈ ప్రాంతానికి సాగునీటి వసతిని కల్పిస్తామని అనేక ఏళ్లుగా ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. 2014లో టిడిపి అధికారంలోకి వచ్చాక రూ.967 కోట్లతో జీడిపల్లి నుంచి భైరవానితిప్పకు ఎత్తిపోతల ద్వారా నీటిని అందివ్వాలని నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు నీటిని అందించే క్రమంలో కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని చెరువులకు నీటిని అందివ్వాలన్నది లక్ష్యం. మొత్తంగా 114 చెరువులకు నీటిని అందివ్వాలని నిర్ణయించారు. ఈ ప్రభుత్వం వచ్చాక కూడా ఈ ప్రాజెక్టును పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి హామీని రాయదుర్గంలో ఇచ్చారు. ఆచరణలో పనులు ముందుకు సాగలేదు. ఇటీవలే కళ్యాణదుర్గం వచ్చినప్పుడు ప్రాజెక్టుకు అవసరమైన 1405 ఎకరాల భూసేకరణకు నిధులు విడుదల చేసినట్టు ప్రకటించారు. అయితే అవి కొంత వరకే వచ్చాయి. ఇంకా పూర్తి స్థాయి భూసేకరణ జరగలేదు. పనులు అర్థాంతరంగా ఆగి ఉన్నాయి. ఇది వస్తే ఈ ప్రాంతంలోని కొన్ని చెరువులకైనా నీరు వచ్చి పంటలు పండించుకునే అవకాశముంది.



చింతపండు-టమోటా ప్రాసెసింగ్ పరిశ్రమలు హామీలకే పరిమితం

ఈ ప్రాంతంలో అత్యధికంగా టమోటా పంటతోపాటు, చింతపండు పంట కూడా సాగవుతుంది. ఈ పంటలకు సంబంధించి ప్రాసెసింగ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి రైతులకు లాభం చేకూరుస్తామని గత ఎన్నికలకు ముందు మంత్రి ఉషశ్రీచరణ్ హామీనిచ్చియున్నారు. అయితే ఈ హామీ తరువాత ఈ హామీ అటకెక్కింది.

మౌళిక సదుపాయల సమస్యలు

వెనుకబడిన కళ్యాణదుర్గం ప్రాంతంలో కనీస మౌలిక సదుపాయలు సమస్యగానే ఉన్నాయి. అనేక గ్రామాలకు సరైన రహదారుల నిర్మాణాలు లేవు. డ్రెయినేజీ, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. అదే సమయంలో వలసలు అధికంగా ఉంటున్నాయి. ప్రధానంగా బ్రహ్మసముద్రం, శెట్టూరు కుందుర్పి తదితర మండలాల నుంచి వలసలు ఎక్కువ. స్థానికంగా ఉపాధి అవకాశాల్లేకపోవడంతో వ్యవసాయ పనులు పూర్తవగానే కేరళ, కర్నాటక రాష్ట్రాలకు వలసలు అధికంగా ఉంటాయి. వీటి నివారణకు తీసుకుంటున్న చర్యలు మొక్కుబడిగానే ఉంటున్నాయి.



మంత్రి ఉషశ్రీచరణ్‌కు స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే

వైసిపి గెలవాలి : మంత్రి

ప్రజాశక్తి -పెనుకొండ

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోమారు జగన్‌ను సిఎం చేసుకుందామని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్ పేర్కొన్నారు. మంత్రి సోమవా రం నగర పంచాయతీ పరిధిలోని 12 వార్డు ఎగువగడ్డ,1వ వార్డు ఇస్లాపురంలో పర్యటించారు. ముందుగా మంత్రికి పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సిఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైసిపిని గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఎజిపిఎం.భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఉమర్‌ఫరూక్, వైస్ ఛైర్మన్ సునిల్, జయశంకర్ రెడ్డి, గోపాల్, వైసిపి నాయకులు తిమ్మారెడ్డి, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, బోయ బాబు, రఘునాథ్‌రెడ్డి, తయూబ్, గణేష్, రామంజి, శ్రీరాములు, క్రిష్టప్ప, టౌన్ కన్వీనర్ బోయ నరసింహ, నాయకులు, శంకర్ రెడ్డి, కొండలరాయుడు, నాయుడు, వాలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆసుపత్రిలో టిడిపి కార్యకర్తను పరామర్శిస్తున్న సునీల్‌కుమార్

టిడిపి కార్యకర్తకు పరామర్శ

మడకశిర : అమరాపురం మండలంలోని హేమావతి గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఓంకార్‌స్వామి తమ్ముడు ఎంజారప్ప ఆదివారం ప్రమాదవశాత్తూ అగ్నిగుండంలో పడడంతో తీవ్రంగా గాయపడి మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలియడంతో సోమవారం టిడిపి, బిజెపి, జన సేన ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్ ఆసుపత్రి వెళ్లి ఎంజారప్పను పరామర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, నాయకులు కూడా ఆసుపత్రికి వెళ్లి ఎంజారప్పను పరామర్శించారు.

నూతన భవనంలోకి ఎపిజిబి

రొద్దం : స్థానిక హిందూపురం రోడ్డు సర్కిల్‌లో ఏర్పాటు చేసినఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఎపిజిబి) నూతన భవనాన్ని సోమవారం బ్యాంక్ చీఫ్ ఛైర్మన్ రాకేష్ కశ్యప్, రీజనల్ మేనేజర్ శ్రీదేవి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ 2017లో ఓ చిన్న గదిలో ఏర్పాటు చేయగా, ప్రస్తుతం కస్టమర్లు పెరగడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నూతన భవనంలోకి మార్చామన్నారు. పెద్దమంతూరు గ్రామంలో కూడా కొత్త భవనంలోకి మార్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ మనోజ్‌కుమార్, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

రొద్దం : మండలంలోని కందుకూర్లపల్లి గ్రామానికి చెందిన టిడిపి నేత హనుమంతరాయుడు భార్య నాగమ్మ సోమవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న బికె పార్థసారథి అల్లుడు శశిభూషన్ వారి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుం బ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు సుబ్బరత్నమ్మ, నరసింహులు, చిన్నప్పయ్య, అశ్వర్థనారాయణ, మురళీకృష్ణ, చంద్ర ఉన్నారు.

‘అనంత అభివృద్ధి నా బాధ్యత’

◆ దగాపాలనకు స్వస్తి చెప్పేందుకు ప్రజలు సిద్ధం
◆ బాహుబలి టైటిల్‌తో పులకేసి సినిమా చూపించారు..
◆ సిద్ధం సభల్లో జనమంతా గ్రాఫిక్స్
◆ శంఖారావంలో నారా లోకేష్
◆ ఉమ్మడి అనంతలో ముగిసిన యాత్ర



అనంతపురంలో అభివాదం చేస్తున్న నారాలోకేష్ తదితరులు



తాడిపత్రి శంఖారావం సభలో ప్రసంగిస్తున్న నారా లోకేష్

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్, తాడిపత్రి రూరల్

ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే తమకు ప్రత్యేకమైన అభిమానం ఉంది. టిడిపి అధికారంలోకి రాగానే ఈ జిల్లా అభివృద్ధి బాధ్యతను నేను తీసుకుంటాను’ అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలియజేశారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపట్టిన శంఖారావ సభలు సోమవారంతో ముగిశాయి. సోమవారం నాడు అనంతపురం, తాడిపత్రి నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలను నిర్వహించారు. అనంతపురం రుద్రంపేట బైపాస్ పివికెకె కళాశాల సమీపంలో అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి, తాడిపత్రి పట్టణంలోని కడప రోడ్డులో నియోజకవర్గ ఇన్‌ఛార్జి జెసి.అస్మిత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభల్లో లోకేష్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైట్ కాలర్ నేరస్తుడన్నారు. క్రిమినల్ రికార్డులు ఉన్నత వరకు జగన్ ఉంటాడని ఎద్దేవా చేశారు. మద్యపానం నిషేదం, సిపిఎస్ రద్దు, జాబ్ క్యాలెండర్, 45 ఏళ్ల వారికి పింఛన్ తదితర హామీలను ఎందుకు నెరవేర్చలేదో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జగన్ ఓ చేత్తే రూ.10 ఇచ్చి మరో చేతో రూ.100 లాగేసుకుంటున్నారని విమర్శించారు. దగా పాలనకు స్వస్తి చెప్పడానికి ప్రజలు సిద్ధమయ్యారని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్రానికి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు ఐక్యమత్యంగా నడుద్దామన్నారు. టిడిపికి కార్యకర్తలే బలం అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లా అంటే టిడిపికి కంచుకోట అన్నారు. మా కుటుంబాన్ని భుజాలపై మోస్తున్న జిల్లాను మరింత అభివృద్ధి చేసి మీ రుణం తీర్చుకుంటామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలు రాష్ట్రాన్ని లూటీ చేశారన్నారు. ఏ తప్పూ చేయని టిడిపి నాయకులపై దొంగ కేసులు పెట్టారన్నారు. టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై అక్రమ కేసులు బనాయించి 52 రోజులు జైల్లో పెట్టారన్నారు. చంద్రబాబు నాయుడు తలుచుకుంటే జగన్ శాశ్వతంగా జైల్లోనే ఉంటాడన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన ఎవరినీ వదిలేది లేదన్నారు. సూపర్-6తో ప్రజలందరికీ మేలు చేస్తామన్నారు. మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. మసీదులకు రంగులు వేయడానికి ఇచ్చే కార్యక్రమాలు యథావిధిగా కొనసాగిస్తామని తెలియజేశారు. మౌజన్లకు గౌరవేతనం కల్పిస్తామన్నారు. బీసీలకు శాశ్వత కులధ్రువీకరణ పత్రం ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రానున్న రెండు నెలలు టిడిపి, జనసేనికులు నిరంతరాయంగా కష్టపడి ప్రజలను కలవాలన్నారు. సూపర్-6ని ప్రజల్లోకి తీసుకెళ్లి తెలుగుదేశం విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం పార్లమెంట్ అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్, మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు జెసి పవన్ కుమార్ రెడ్డి, తాడిపత్రి జనసేన నియోజకవర్గం ఇన్‌ఛార్జి శ్రీకాంత్ రెడ్డితో పాటు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన మద్దతుదారుల తోపులాట

అనంతపురం శంఖారావం సభా ప్రాంగణంలో టిడిపి జనసేన పార్టీ నేతల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. తోపులాట వాగ్వివాదం తలెత్తి కార్యకర్తలు ఒకరిపై ఒకరు చేయిచేసుకున్నారు. అక్కడే ఉన్న టిడిపి నియోజకవర్గం ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి నేతలకు సర్ది చెప్పి ఘర్షణను అదుపు చేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గం టికెట్ తమకంటే తమకంటూ జనసేన, టిడిపి మద్దతుదారులు ఘర్షణ పడ్డారు.

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదు

గోరంట్ల : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో ఇష్టారాజ్యంగా నిర్మాణాలు చేపడుతున్నారని, ఇప్పటికే పునాదులు సైతం తీశారని సోమవారం స్పందనలో తహశీల్దార్ అక్బుల్ బాషాకు జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి సురేష్ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాల ను తక్షణమే ఆపకపోతే రిలే నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టకూడదని ఇది వరకే హెచ్చరిక బోర్డు ఏర్పా టు చేశామన్నారు. ధిక్కస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూమిలో నిర్మాణ పనులకు వచ్చే వారిపై కూడా చర్యలు తప్పవన్నారు.

నేడు రక్తదాన శిబిరం

గోరంట్ల : పట్టణంలోని ఎస్వీవీఎం డిగ్రీ కళాశాలలో ఈ నెల 12వ తేదీ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వ ర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ భక్తవత్సలం తెలిపారు. శిబిరంలో యువకులు పాల్గొని రక్తదానం చేసి విజయవంతం చేయాలని కోరారు.

కెజిబివిలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

లేపాక్షి : స్థానిక కస్తూరిబా పాఠశాలలో 2024-2025లో 6, 11వ తరగతిలో ప్రవేశాలకు ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎస్ఒ నీలిమ ఓ ప్రకటనలో తెలిపారు.

బిసి డిక్లరేషన్‌పై హర్షం

మడకశిర : టిడిపి, జనసేన పార్టీలు ఉమ్మడిగా బిసి డిక్లరేషన్ ప్రకటించడం హర్షణీయమని రాష్ట్ర కుంచితి వక్కలిగ సాధికార సమితి అధ్యక్షులు విఎం పాండురంగప్ప పేర్కొన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాల యంలో సోమవారం నియోజకవర్గంలోని కుంచితి వక్కలిగలు సమావేశమై టిడిపి, జనసేన పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కుంచితి ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ పాండురంగప్ప మాట్లాడుతూ వక్కలిగల అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. టిడిపి, జనసేన పార్టీలు ఉమ్మడిగా బిసి డిక్లరేషన్ ప్రకటించడం శుభపరిణామమన్నారు. బిసి డిక్లరేషన్ ప్రకటనతో జగన్ గుండెల్లో రైళ్లు పరుగెత్తడం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో వీరాక్యాతరాయ, ఉగ్రనరసింహ, జయరామిరెడ్డి, అశ్వర్థామప్ప, ఆదినారాయణ, రాజగోపాల్, టిడి పల్లి మంజునాథ్‌గౌడ్, జయరామప్ప, రామన్న, రవికుమార్, రామచంద్రప్ప, తిమ్మేగౌడ, హనుమంతరాయ పాల్గొన్నారు.



చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టిడిపి నాయకులు

'స్పందన'లో ఒకే ఒక్కరు.!

సంబులపూలకుంట : మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఒకే ఒక్క అధికారి హాజరయ్యారు. ఎంపీడీవో తప్ప మిగతా శాఖల అధికారులు ఏ ఒక్కరూ హాజరుకాలేదు. ఇదివరకు నిర్వహించిన స్పందనలో పలు శాఖల అధికారులు వచ్చి సంతకాలు చేసి వెళ్లిపోయేవారు. వీరి తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అయితే ఈ సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఏకంగా డుమ్మాకొట్టారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందనకు ఆయా శాఖల అధికారులు తప్పక హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మాతాశిశు మరణాలను తగ్గించాలి

ఓబులదేవర చెరువు : మాతాశిశు మరణాల రేటుపైనా ఏ దేశ ప్రగతి ఆధారపడి ఉంటుందని వైద్యాధికారి డాక్టర్ కమల్ రోహిత్ పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు ప్రధానమంత్రి సురక్షిత్ మాతృ వందనా అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు గర్భిణులకు ఆరోగ్య అంశాల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కదిరి రోటరీ క్లబ్ ప్రతినిధి ప్రవంతి, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు, రోటరీ క్లబ్ ఇతర ప్రతినిధులు నిసార్, ఫృథ్వీ రాజ్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పంట నష్టపరిహారం

కొత్తచెరువు : 2023 ఖరీఫ్ లో పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పంట నష్టపరిహారం మంజూరు చేసిందని వ్యవసాయ శాఖ అధికారి నటరాజు తెలిపారు ఇటీవల ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి నిధులను విడుదల చేశారన్నారు. మండలానికి 3280 మంది రైతులకు రూ.3.95 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. అర్హులైన రైతులకు వారి ఖాతాల్లో త్వరలోనే పరిహారం జమ అవుతుందన్నారు.

ఇష్టపడి చదవండి

గాండ్లపెంట : పదోతరగతి విద్యార్థులు ఇష్టపడి చదివి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని మండల కేంద్రంలోని ఆదర్స్ పాఠశాల కరస్పాండెంట్ మహేష్‌బాబు తెలిపారు. పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులు సోమవారం సరస్వతి పూజ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఇఒ బి కష్ణ నాయక్, పామిడి ముంతాజ్ ఆలీ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మల్లికార్జున, రాజశేఖర్ రెడ్డి, బీవీ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ధర్మవరం టౌన్ : నియోజకవర్గానికి చెందిన ఏడుగురు బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పంపిణీ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే తన స్వగృహంలో ఏడుగురు బాధితులకు రూ.14.05 లక్షలు విలువ చేసే చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని నిరాశ్రయుల వసతి కేంద్రంలో క్రాంతి సొసైటీ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ మెప్మా సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ సాయిచంద్రిక 30 మందికి వైద్య పరీక్షలు జరిపి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కాచర్ల లక్ష్మీ, మెప్మా మిషన్ డైరెక్టర్ విజయలక్ష్మి, మెప్మా సిబ్బంది, టీపిఆర్ఓ సుబ్బరాయుడు, వెంకటేష్, కౌన్సిలర్ బాల ఓబులమ్మ, ఆర్పీలు సరోజా, శారద తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న సినీ ఆర్ట్ డైరెక్టర్

కదిరి టౌన్ : కదిరి పట్టణంలోనిఖాద్రీ లక్ష్మీనరసింహ స్వామినితెలుగు చలన చిత్ర పరిశ్రమ ఆర్ట్ డైరెక్టర్ సాహి సురేష్ సోమవారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆయన ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

రక్త సేకరణ పనిముట్లు అందజేత

కదిరి టౌన్ : సినీ నటులు రాంచరణ్ పుట్టిన రోజు సందర్భంగా రామ్ చరణ్ యువ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కదిరి ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉన్న రక్తనిధి సెంటర్‌కు రక్తసేకరణ పనిముట్లను సోమవారం అందజేశారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ హుస్సేన్‌కు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మణ కుటాల, సాదిక్, శ్రీనివాసులు , సాయి, చక్రి , కార్తిక్ , అరవింద్ , రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

కదిరిటౌన్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో భాగంగా శాంతియుతంగా ఎన్నికలు జరిపించేందుకు కదిరి పట్టణంలో సోమవారం పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమం డీఎస్పీ శ్రీలత అధ్యక్షతన నిర్వహించారు స్థానిక డివిజన్ పోలీసులతో పాటు బిఎస్ఎఫ్ సిబ్బంది దాదాపు 100 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పట్టణ సిఐ పుల్లయ్య, గ్రామీణ సర్కిల్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోనగర్ ఏర్పాటుచేయాలి

కదిరి టౌన్ : కదిరి పట్టణంలో ఆటోనగర్ నిర్మించాలని కోరుతూ కదిరి ఆటో ఇంజనీరింగ్ వర్కర్స్, ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటు చేయాలని గత 20 సంవత్సరాలుగా అనేకసార్లు విన్నవించుకున్నామన్నారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహశీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ మహబూబ్ బాషా, మొగల్ ఇర్ఫాన్, బాబా ఫక్రుద్దీన్, సమీ, సాదిక్, బాబ్జాన్, రియాజ్, ఇస్మాయిల్, దాదు, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు

ఎన్నికల బాండ్ల వివరాలు బహిర్గతం చేయాలి : సిపిఎం



కదిరిలో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి-పెనుకొండ

ఎలక్ట్రోరల్ బాండ్ వివరాలను బహిర్గతం చేసే సుప్రీం కోర్టు ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం పట్టణంలోని ఎస్‌బిఐ బ్యాంక్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్దన్న మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేయక పోవడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రోరల్ బాండ్ వివరాలను బహిర్గతం చేయకపోవడం అంటే ఎస్‌బిఐలోని 44 కోట్ల మంది ఖాతాదారులను మోసం చేయడంతో పాటు దేశాభివృద్ధికి ఆటంకం కలిగించడమే అన్నారు. అనంతరం బ్యాంక్ మేనేజర్‌కి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో నాయకులు గంగాధర్, వెంకటరాముడు, తిప్పన్న, ఉత్తప్ప, వ్యకాసం నాయకులు నారాయణ, బెస్త క్రిష్టప్ప, చేనేత కార్మిక సంఘం నాయకులు శీలా నారాయణస్వామి, కుమ్మరి కిష్టప్ప, కల్లు గీత కార్మిక సంఘం నాయకులు కిష్టప్ప, నరసింహమూర్తి, అంజనప్ప, తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : ఎన్నికల బాండ్ల వివరాలను కోర్టుకు సమర్పించాలని కోరుతూ సోమవారం స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ మేనేజర్‌కు సిపిఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఎన్నికల బాండ్ల కార్యక్రమం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ సుప్రీంకోర్టు దీన్ని రద్దు చేసిందన్నారు. ఎన్నికల బాండ్ల వివరాలను కోర్టుకు సమర్పించాలని ఆదేశించింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఎస్ బి ఐ మీద ఒత్తిడి తీసుకువచ్చి వివరాలు ఇవ్వకుండా కాలయాపన పూనుకుందని విమర్శించారు. ఎస్‌బిఐ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తక్షణమే ఎన్నికల బాండ్ల వివరాలను అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బడా సుబ్బిరెడ్డి, పట్టణ కార్యదర్శి జిఎల్. నరసింహులు, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, నాయకులు జగన్, రామ్మోహన్, ముస్తాక్, తిరుపాల్, క్రిష్ణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనే లక్ష్యం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్

ప్రజాశక్తి-హిందూపురం

మహిళలు తమ హక్కుల సాధనే లక్ష్యం గా ముందుకు సాగాలని శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని వాసవి ధర్మశాలలో సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు అంగన్వాడీ యూనియన్ కార్యదర్శి లావణ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రామిక మహిళా సంఘం జిల్లా కన్వీనర్ దిల్షాద్, ప్రముఖ గైనకాలిస్టు నాగ సింధు, మహిళా నాయకురాలు రజని, ఆశా సెక్రెటరీ మమత, దివ్య చారిటబుల్ ట్రస్ట్ వేణుగోపాల్ రావు, కెవిపిఎస్ నాయకురాలు జ్యోతి, సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, సాంబ శివ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో నేటికీ మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే ఎంతో మంది మహిళలు ప్రపంచ వ్యాప్తంగా సమానత్వం కోసం తమ గొంతుకను వినిపిస్తూనే ఉన్నారని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల చిన్నచూపుతోనే చూస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలోనే అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని తమ హక్కుల కోసం పోరాటాలను సాగించాలన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ ఆటల పోటీలను నిర్వహించారు. పాల్గొన్న వారికి దివ్య చారిటబుల్ ట్రస్ట్ వేణుగోపాల్ రావు నగదు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ రంగం మహేశ్వరి, సిఐటియు నాయకులు రాజప్ప, జగదీష్, రాము, రామకృష్ణ తో పాటు శిరీషా, అంగన్ వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : మహిళా సాధికారతే సమాజ ప్రగతికి దోహదపడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో భాగ్యరేఖ, సిరికల్చర్ జాయింట్ సెక్రెటరీ పద్మమ్మ, జిల్లా వెనుకబడిన తరగతుల శాఖ సంక్షేమ అధికారి నిర్మల జ్యోతి మాట్లాడారు. నేడు మహిళలు అన్ని రంగాల్లో పోటీపడుతూ ఎన్నో విజయాలను సాధిస్తూ సమాజాభివృద్ధికి దోహదపడుతున్నారన్నారు. తమ పిల్లలను బాగా చదివించి ఉన్నతమైన స్థాయికి తీసుకురావడంలో మహిళా పాత్ర కీలకమన్నారు. ఈ సందర్భంగా మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పీడీ నరసయ్యతో పాటు 32 మండలాల నుండి మండల సమాఖ్య అధ్యక్షులు, కార్యదర్శులు ,కోశాధికారులు, డిఆర్‌డిఎ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్



సమస్యను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

స్పందనలో వచ్చే అర్జీలకు నిర్ణీత గడువులోగా పరిష్కరించి ఫిర్యాదు దారులకు న్యాయం చేయాలని కలెక్టర్ అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ, సచివాలయాల నోడల్ అధికారి శివారెడ్డి, డిపిఒ విజయ్ కుమార్, తదితరులు హాజరయ్యారు. స్పందనలో 165 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ అర్జీదారులు సంతృప్తి చెందే విధంగా నిర్ణీత గడువులోగా తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల 13న జిల్లాలో ప్రాథమిక భవనాలు పూర్తి అయిన వాటిని ఆయా మండల ప్రత్యేక అధికారులు స్థానిక ఎమ్మెల్యే అనుమతితో వాటిని పండుగ వాతావరణంలో ప్రారంభించాలని తెలిపారు. జిల్లాలో రైతు భరోసా కేంద్రాలు 40, గ్రామ సచివాలయాలు 42, వైయస్సార్ హెల్త్ క్లినిక్ లు 12 భవనాలు మొత్తం 94 ఉన్నాయని వాటికి ప్రారంభోత్సవ కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. ఎన్నికలకు సంబంధించిన క్లైములు అన్నింటిని సత్వరమే పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారులను ఆదేశించారు. ధర్మవరం డివిజన్ లో అధిక సంఖ్యలో క్లైములు ఉన్నాయని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్థానిక ఎంపీడీవోలు, మున్సిపాలిటీ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలో ఎన్నికల కోడ్ రానున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎన్నికల ప్రవర్తన నియమాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిసిహెచ్ఎస్ డాక్టర్ ఎంటి. నాయక్, డిసిఒ కృష్ణ నాయక్, గృహ నిర్మాణాల శాఖ పీడీ వెంకటనారాయణ, ధర్మవరం ఆర్డీవో వెంకట శివ సాయి రెడ్డి, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణ, సాంఘిక సంక్షేమ అధికారి శివ రంగ ప్రసాద్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి మోహన్ రావు, వ్యవసాయ అధికారి సుబ్బారావు, బీసీ సంక్షేమ శాఖ అధికారి నిర్మల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి : సిఐటియు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని కోడూరు పంచాయతీ పరిధిలో గల స్వచ్ఛ భారత్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న పన్నెండు నెలల వేతనాలు చెల్లించాలని సిఐటియు నాయకులు, ఎపి పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎంపిడిఒ రాంకుమార్‌కు తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరు పంచాయతీలో పని చేస్తున్న 9 మంది కార్మికులకు 12 నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.కోడూరు పంచాయతీ కార్యదర్శి, సర్పంచి దళిత కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేయడం తగదని అన్నారు. వేతనాలు అడగటానికి వెళ్లిన కార్మికులను తొలిగిస్తామని బెదిరించడం తగదని అన్నారు. వారి విధానం మార్చుకోక పోతే కోడూరు లో భిక్షాటన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ప్రవీణ్ కుమార్, లక్ష్మినారాయణ కార్మికులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రజాశక్తి -చిలమత్తూరు

మండల పరిధిలోని టేకులోడు గ్రామపంచాయతీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు టేకులోడు సచివాలయం ముందు ఖాళీబిందెలతో ఆందోళనకు దిగారు. వీరి ఆందోళకు మద్దతు తెలిపిన ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రెండు నెలలుగా గ్రామంలో తాగునీటి సమస్య ఉందన్నారు. సమస్యను గ్రామస్తులు పలుమార్లు కార్యదర్శికి విన్నవించిన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నారు. విషయం తెలుసుకున్న సర్పంచి భర్త బయపరెడ్డి సంఘటన స్థలానికి వచ్చి గ్రామస్తులతో మాట్లాడారు. నీటిబోరును మరమ్మతు చేయించి తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ప్రవీణ్ కుమార్, లక్ష్మినారాయణ, చరణ్, గ్రామస్తులు ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

అజెండాలపై నిర్ణయాలు ఎక్కడ తీసుకుంటారో తేల్చండి



మాట్లాడుతున్న కౌన్సిలర్ మహాలక్ష్మి

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ అభివృద్ధిపై అధికారులు రూపొందించిన అజెండాలపై నిర్ణయాలు కౌన్సిల్ సమావేశంలో తీసుకుంటారా...? లేదా చైర్ పర్సన్ చాంబర్ లో తీసుకుంటారా...? ప్రతి పక్ష కౌన్సిలర్లు అని చైర్ పర్సన్ ఇంద్రజ, కమిషనర్ శ్రీకాంత్ రెడ్డిని నిలదీశారు. సోమవారం పురపాలక సంఘ కౌన్సిల్ హాల్ లో చైర్ పర్సన్ ఇంద్రజ అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు 12 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. పరిగి బస్టాండ్ లోని కొంచెం ఖాళీ స్థలం ప్రైవేట్ వ్యక్తికి లీజుకి ఇచ్చే అంశం చేర్చడంపై టిడిపి కౌన్సిలర్లు తీవ్రంగా ఖండించారు. కౌన్సిలర్ రమేష్ మాట్లాడుతు గత కౌన్సిల్ లో టిడిపి కౌన్సిలర్లతో పాటు మెజారిటీ సభ్యులు ఇదే అంశానికి డీసెంట్ తెలిపారన్నారు. డీసెంట్ ఇచ్చిన అంశంపై మళ్లీ ఎందుకు చేర్చారని నిలదీశారు. అజెండాలో చేర్చే అంశాలపై ఒకటికి రెండు సార్లు ఆలోచన చేసి చేర్చాలని అధికారులకు, పాలకులకు సూచించామని అయినప్పటికీ ఎందుకు చేర్చారని చైర్ పర్సన్ ఇంద్రజను కౌన్సిలర్ రమేష్ నిలదీశారు. పట్టణంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారిందనికౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్ లతో పాటు అధికార పార్టీకి చెందిన కొంద మంది కౌన్సిలర్లు వాపోయారు. ఫాగింగ్ చేయక పోయిన ఫాగింగ్ కోసం రూ.10లక్షలు ఖర్చు చేయడానికి ఎలా చేర్చారన్నారు. దీంతో పాటు ఇతర ప్రజా సమస్యలపై పలువురు కౌన్సిలర్లు మాట్లాడారు. అనంతరం డీసెంట్ ఇచ్చిన అంశం మినహా మిగిలిన అంశాలను ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మేన్లు జబివుల్లా, బలరామి రెడ్డి, కమిషనర్ శ్రీకాంత్ రెడ్డితో పాటు ఇతర మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం

ప్రజాశక్తి పుట్టపర్తి అర్బన్

సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి అంతర్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలలో భద్రత కట్టుదిట్టం చేయాలని జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు, జిల్లా ఎస్పీ మాధవరెడ్డి కోరారు. సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్లో కలెక్టర్ తో పాటు ఎస్పీ తదితరులు కర్నాటక రాష్ట్రం తుముకూరు, చిక్కబల్లాపూర్, చిత్రదుర్గ ప్రాంతాలకు సంబంధించిన జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సెబ్ అడిషనల్ ఎస్పీ నాగభూషణం, సెబ్ డీఎస్పీ సుబ్రహ్మణ్యం, డిఆర్ఓ కొండయ్య, పుట్టపర్తి ఆర్‌డిఓ భాగ్యరేఖ, పలువురు ఎక్సైజ్ రెవిన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా నైసర్గిక స్వరూపము, ఎన్నికల నిర్వహణ కేంద్రల వివరాలు, కర్నాటక ఆంధ్ర సరిహద్దు మ్యాపింగ్ అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పరస్పర సహకారాలతో సార్వత్రిక ఎన్నికల విధులను నిర్వహించుకుందామని కర్నాటక రాష్ట్ర సరిహద్దు జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలను కలెక్టర్ కోరారు. జిల్లాలోని పలు మండలాలు అంతర్రాష్ట్ర సరిహద్దులలో ఉన్నాయని అందులో ఆయా ప్రాంతాల ద్వారా మద్యం, నగదు, ఆయుధాలు, మాదక ద్రవ్యాలు తదితర అక్రమ రవాణా సత్యసాయి జిల్లాలో ప్రవేశించకుండా ఇరు ప్రాంతాల అధికారులు పటిష్ట నిఘా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, ఎక్సైజ్, తదితర అధికారులు పాల్గొన్నారు.

దేశ సుస్థిరతకు పాటుపడదాం

ప్రజాశక్తి-హిందూపురం

అన్ని పండుగలను, సామాజిక సేవా కార్యక్రమాలను కుల మతాలకు అతీతంగా కలిసి మెలిసి జరుపుకుని దేశ సుస్థిరతకు, జాతీయ సమైక్యతకు పాటుపడతామని వక్తలు పిలుపు నిచ్చారు. సోమవారం పట్టణంలోని హండర్ట్ గ్లోబల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలను హిందూ, ముస్లీం, సిఖ్, ఈసాయి బాయిబాయి నినాదంతో కంచి కామాక్షి కళ్యాణ మంటపంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న వారిని, కుల సంఘాల నాయకులను, పుర ప్రముఖులను ఘనంగా సత్కరించారు.

కనిపించిన నెలవంక

హిందూపురం : రంజాన్ మాసం నెలవంక సోమవారం సాయంత్రం కనిపించడంతో అన్ని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం అయ్యాయి. మంగళవారం నుంచి ముస్లీం సోదరులు ఉపవాసదీక్షలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో హిందూపురం పట్టణంలోని దాదాపు 110 మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు సోమవారం నుంచి ప్రారంభించినట్లు ఆయా మసీదు ముతవల్లిలు తెలిపారు. ప్రతిరోజు ఉదయం సెహేరి కోసం తెల్లవారు జామున ముక్కడి పేటలోని మసీదులో భోజనం ఏర్పాటు చేసినట్లు మసీదు నిర్వాహకులు తెలిపారు.

నేరాలు ఘోరాలు

ఆటో కిందపడి చిన్నారి మృతి

బత్తలపల్లి : ఇంటి ముందుకు వచ్చిన ఆటో కింద పడి చిన్నారి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన బత్తలపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. ప్రత్యక్షసాక్షులు, పోలీసులు తెలిపిన వివరాలు... బత్తలపల్లిలోని బృందావన కాలనీకి చెందిన బాషా, ఫాతిమా దంపతులకు ఒక కుమారుడు, ఏడుగురు కుమార్తెలు ఉన్నారు. సోమవారం వారి ఇంటి ముందుకు ఫిల్టర్ నీరు తీసుకొని వచ్చిన ఆటో నీరు నింపిన తరువాత బయలుదేరింది. ఈ సమయంలో ఆటో వెనుక ఉన్న బాషా, ఫాతిమా చిన్న కుమార్తె షాహిదా(2) చిన్నారి ఆటో చక్రాల కింద పడింది. ఈ ప్రమాదంలో చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సోమశేఖర్ మూర్తి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఆటో డ్రైవర్ రామాంజనేయులును అదుపులోకి తీసుకున్నారు. చిన్నారి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళ గొంతుకోసి.. దుకాణంలో నగదు చోరీ

ధర్మవరం టౌన్ : పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో గుర్తుతెలియని ముగ్గురు దుండగులు ఓ మహిళ గొంతు కోసి నగదును ఎత్తికెళ్లిన సంఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు... లక్ష్మీ చెన్నకేశవపురంలోని చెందిన అమృత అనే మహిళ ఇంటివద్ద చిల్లర దుకాణం పెట్టుకుంది. గుర్తుతెలియని దుండగులు ముగ్గురు సోమవారం ఆమె దుకాణంలోకి చొరబడ్డారు. మహిళ గొంతుకోసి మెడలో ఉన్న గొలుసు లాక్కొని దుకాణంలో ఉన్న నగదును ఎత్తికెళ్లారు. గమనించిన స్థానికులు ఆమెను చికిత్స కోసం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు ఆమెకు చికిత్స చేశారు. ప్రస్తుతానికి ఆమెకు ఎటువంటి ప్రాణాపాయం లేదు. బాధితురాలు అమృత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పంటలకు నిప్పు

ఓబులదేవరచెరువు : మండలంలోని ఇనగలూరు గ్రామ పంచాయతీలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శబరిష్ నాయుడు పొలంలోని కొర్ర, అనప పంటకు ఆదివారం రాత్రి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకుంది. ఈ ప్రమాదంలో పంటమొత్తం కాలిబూడిద అయింది. దీంతో బాధితరైతులకు రెండు లక్షల రూపాయల వరకు నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు సామకోటి ఆదినారాయణ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సీనియర్ నాయకులు నిజాం వలి, తెలుగుదేశం నాయకుడు రమణ, అంజి నాయుడు హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

పుట్టపర్తి క్రైమ్ : పుట్టపర్తి మున్సిపల్ పరిధిలోని పెద్ద బజారుకు చెందిన ఆటో డ్రైవర్ ఎరికిల రామచంద్ర (46) గుండెపోటుతో మృతిచెందాడు. రామచంద్ర కుటుంబ ఆర్థిక పరిస్థితి చాలా దయనీయత స్థితిలో ఉన్నదని తెలుసుకున్న ఆయన చిన్ననాటి మిత్రుడు ఆర్ఎంపి గంగాధర్ మృతుని కుటుంబ సభ్యులకు అండగా నిలబడాలని నిర్ణయించుకున్నారు. ఈ సందర్భంగా తన మిత్రులు పోరెడ్డి శ్రీనివాసులు, వాసు, శ్రీనాథ్, చాందుభాషా, స్వర్ణలత వారి స్నేహితులు సహకారంతో రామచంద్ర కుటుంబానికి ఆర్ఎంపీ గంగాధర్ ఆధ్వర్యంలో రూ. 60వేలను మృతుని కుటుంబసభ్యులకు అందజేశారు. దీంతో మృతుడు రామచంద్ర భార్య సునీత, కుమార్తెలు నివేదిత, శరణ్య, వీరికి కతజ్ఞతలు తెలిపారు.

గడపగడపకూ ఎన్నికల ప్రచారం

గాండ్లపెంట : మండల కేంద్రంలోని మెయిన్ రోడ్‌లోని గంగాభవాని వీధి, మసీదు వీధి, జీనులకుంట రోడ్డు తదితర ప్రాంతాల్లోకదిరి వైసిపి నియోజకవర్గ అభ్యర్థి బి ఎస్ మక్బుల్ భాష సోమవారం ప్రచారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన పథకాలు ప్రజలకు వివరించారు. రెండోసారి సీఎంగా జగన్మోహన్ రెడ్డిని చేద్దామని అన్నారు. ఈ కార్యక్రమంలో జేఎస్‌ఏ పోరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, ఎంపీపీ జగన్‌మోహన్, వైసీపీ మండల కన్వీనర్ జి రవీంద్రారెడ్డి, మాజీ జడ్పిటిసి భాస్కర్ రెడ్డి, సింగల్ విండో అధ్యక్షుడు ఎస్ పి హైదర్, సర్పంచులు రవీందర్ నాయక్, రహమతుల్లా, ఎంపీటీసీ పామిడి కమర్జహన్, ఆర్‌బికె ఛైర్మన్ వైవి. శంకర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీతో అందరికీ న్యాయం

కదిరి టౌన్ : వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతోందని వైసీపీ నియోజకవర్గ సమన్వయ కర్త మాక్బుల్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 27వ వార్డులో కౌన్సిలర్ ఉట్టి గౌతమిఓంప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మక్బూల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి వైసిపి చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ ప్రచార కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసరెడ్డి, పట్టణ అధ్యక్షులు జిలాన్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్మన్ అజ్జుకుంట రాజశేఖర్ రెడ్డి, వైసిపి నాయకులు సాదత్ అలీ ఖాన్, పరికి సాధిక్‌బాషా, ఫర్హానాఫయాజ్, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న మక్బూల్

మినీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లండి

ధర్మవరం టౌన్ : టీడీపీ అదినేత ప్రకటించిన మినీ మేనిఫెస్టోలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చేఎన్నికలలో టీడీపీ విజయానికి కృషిచేయాలని టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశేసుధాకర్ పిలుపు నిచ్చారు. ఈ మేరకు సోమవారం శంఖారావం- బాబు సూపర్‌సిక్స్ క్యాలెండర్లను కార్యకర్తలకు ఆయన పంపిణీచేశారు. ఈ పథకాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వార్డుల్లో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భీమనేని ప్రసాద్‌నాయుడు, మాధవరెడ్డి, గోసలశ్రీరాములు, తొగట అనిల్, చీమలరామాంజి, గంగాద్రి, పవన్‌కుమార్, రాజేశ్వరి, బాను తదితరులు పాల్గొన్నారు.

న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్‌లో 'పురం' వాసుల ప్రతిభ

హిందూపురం : టైగర్ షంషీరుద్దీన్ మిస్టర్ రాయలసీమ న్యూ ఆంధ్ర బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కడప కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన బాడీ బిల్డింగ్, మెన్ ఫిజిక్స్ పోటీల్లో హిందూపురానికి చెందిన యువకులు ప్రతిభ చాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఎంపీ అవినాష్ రెడ్డి, వైసిపి నాయకులు సుభాన్ భాష పాల్గొన్నారు. నబ్బా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ కుమార్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ న్యామతుల్లా నేతత్వంలో నిర్వహించిన ఈ పోటీలకు జిల్లా వ్యాప్తంగా 115 మంది బాడీ బిల్డర్లు పాల్గొన్నారు. అందులో హిందూపురం కింగ్ స్టార్ జిమ్ తరపున షబ్బీర్ మెన్ ఫిజిక్స్ లో మొదటి స్థానం, బాడీ బిల్డింగ్ 60 కేజీల కేటగిరీలో మొదటి స్థానం సాధించి గోల్డ్ మెడల్, మెమొంటో, సర్టిఫికెట్ ను అందుకున్నాడు. అదేవిధంగా సెవెన్ స్టార్ జిమ్ తరపున మంజు బాడీ బిల్డింగ్ 65 కేజీల క్యాటగిరిలో మొదటి స్థానం సాధించి గోల్డ్ మెడల్, మెమొంటో, సర్టిఫికెట్ ను అందుకున్నాడు. అలాగే కింగ్ స్టార్ జిమ్ తరపున పోటీ చేసిన యువకులు ఇమ్రాన్ బాడీ బిల్డింగ్ లో రెండవ స్థానం, హర్ష మూడవ స్థానం, నూర్ బాడీ బిల్డింగ్ లో మూడవ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ చాటిన వీరిని జిమ్ నిర్వాకుడు షఫీ, ట్రైనర్లు సమీ, ఇలియాస్, రహీం తదితరులు అభినందించారు.

'సూపర్-6తో ప్రజలకు లబ్ధి'

కదిరి టౌన్ : టీడీపీ జనసేన ఉమ్మడి మేని ఫెస్టో సూపర్ సిక్స్ పథకాలతో ప్రజలకు లబ్ధి చేకూరుతుందని కందికుంట యశోద దేవి అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం కదిరి పట్టణంలోని 11వ వార్డు లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె ప్రతి ఇంటికి తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబ్జాన్, డైమండ్ ఇర్ఫాన్, కృష్ణమోహన్ నాయుడు, దిల్దార్ నర్సారెడ్డి, శ్రీనివాసులు, షాకీర్ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని అందజేస్తున్న కందికుంట యశోదాదేవి

డాక్టర్లకు క్రీడా పోటీలు

కదిరి అర్బన్ : మెడికల్ అసోసియేషన్ కదిరి బ్రాంచ్ ఆధ్వర్యంలో తాలూకా పరిధిలోని డాక్టర్లకి స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. షటిల్, క్రికెట్ క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ డాక్టర్లు శంకరయ్య, డాక్టర్ నాగరాజు, డాక్టర్ రమణయ్య, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ప్రసాద్ హాజరై యువ డాక్టర్లకు ప్రోత్సాహాన్ని అందించారు.